


# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఎదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచ్చెక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

## అమెరికా కోడలికం

"ఉదయం తొమ్మిద్దిన్నరకి, అదీ సోమవారం నాడు కాలింగ్ బెల్లా? ఎవరబ్బా! వారంలో ఐదు రోజులు ఆన్లైన్ డెలివరీ వాళ్ళకి తప్పించి నేను ఒకదాన్ని ఉన్నాననే విషయం ఎవరికీ పట్టదు కదా! ఎవరు వచ్చారో నాకోసం" అనుకుంటూ 'పీప్ హోల్' నుండి చూసాను.

"ఏంటి భవ్యా! నిజంగానే!" అని మరొక్కమారు చూసి, గభీలున తలుపు తెరిచా.

"ఆఫీస్ అవతారంలో అలానే వచ్చేసావే? ఫార్మల్సు, లాప్టాప్ ఏంటే ఇది?" అని అడిగాను.

జవాబు ఏమీ ఇవ్వకుండా, నన్ను పక్కకి నెట్టి, లాప్టాప్ బాగ్ పక్కన పడేసి సోఫాలో కూలబడింది.

"ముందైతే వేడిగా ఒక కాఫీ పెట్టవే!" అని ఆర్డర్ వేసింది.

కాఫీ ఇచ్చి ఎదురుగా కూర్చున్నాను. భవ్య మావారి కొలీగ్. ఒకసారి తన ఆఫీస్ క్రిస్మస్ పార్టీలో కలిసాము. అప్పటినుండి మంచి స్నేహం కుదిరింది ఇద్దరికీ. అప్పుడప్పుడూ కలుసుకుని మనసులో ఉన్న చికాకులు అన్నీ చెప్పేసుకుని, తల మీద భారాన్ని దింపేసుకుంటూ ఉంటాము. పని రాక్షసి అంటూ ఉంటారు భవ్యని అంతా. అలాంటిది ఇలా ఉన్నపళంగా ఆఫీస్ కని చెప్పి నా దగ్గరికి వచ్చిందంటే ఏదో విషయం ఉండే ఉంటుంది.

“థాంక్స్ వే! ఇలా తీరిగ్గా కాఫీ తాగి ఎన్ని రోజులైందో. ఈరోజు ఇక్కడే ఉంటాను సాయంత్రం దాకా. సరే నా?”

“ఆహా, అడగాలా అసలు. హాయిగా ఉండు. అవును మరీ ఆఫీస్ వర్కు? వర్క్ ఫ్రొం ‘ఫ్రెండ్స్’ హోమా?”

“ఛ, ఏం కాదు. సుబ్బరంగా లీవ్ పెట్టేసా. ఆఫీస్ కి వెళ్ళినప్పుడు కనీసం ఉన్నానా లేనా అని చూడడు కానీ, వర్క్ ఫ్రొం హోమ్ అంటే చాలు ఏడ్చి చస్తాడు మా మేనేజర్. అరగంటకో ఫోన్ కాల్ చేసి ఓ చెకింగ్ చేస్తూ ఉంటాడు.”

“మంచి పని చేసావ్ కానీ, ఏంటి అంత అలసటగా ఉన్నావు?” అని అడిగా. అంతే ఈ ఒక్కమాటతో బరస్ట్ అయిపోయింది.

“నిమిషం తీరిక ఉంటే కదా అసలు. చివరికి పాప గురించి కూడా ఆలోచించకుండా ఇక్కడి వచ్చేసానంటే చూస్కో. నా వల్ల కావడం లేదే మేనేజ్ చెయ్యడం. పాప పుట్టాక అమ్మ వచ్చి ఒక ఐదు నెలలు ఉండి వెళ్ళింది. రెండు నెలలకే జాబ్ లో జాయిన్ ఐపోయాను. అమ్మ ఉన్నప్పుడు బాగానే సాగింది. ఇప్పుడు అత్తయ్య వచ్చింది.” అంటూ చెప్పడం మొదలుపెట్టింది.

“ఇదే ఆవిడ మొదటిసారి అమెరికా రావడం. అసలు పక్క రాష్ట్రం కూడా వెళ్ళివుండరు అనుకుంట ఇండియాలో. ఎంత సంబరపడిపోయారో మొదట్లో. అమెరికా నచ్చనిది ఎవరికీ! ‘అమ్మాయ్! భలే ఉంది ఇక్కడంతా. మన పక్కింటి లీల గారు వెళ్లివచ్చి చెప్తుంటే బడాయి అనుకున్నాను గానీ ఆవిడ చెప్పిందానికంటే కూడా చాలా బాగుందే ఈ దేశం. అస్సలు దుమ్ము అనేదే లేవకుండా ఎలా వేసారో చూడు రోడ్లు. ఊరా ఇది? నందనవనం!’ అంటూ భలే సంబరంగా చెప్పేవారు.

“ఇక్కడి చెట్టూ, పుట్టా, కొండా, కోన, వాగూ వంకా అన్ని చూపిస్తుంటే ఎంత బాగా ఎంజాయ్ చేసేవారో. మా ఇద్దరికీ చాలా సంతోషంగా అనిపించింది. చదువుకుని ఉద్యోగం చేస్కునే పిల్లనని నేనంటే ఆవిడకి భలే ముచ్చట. పెళ్లయిన తరువాత అమెరికా వచ్చేయడంతో మా ఇద్దరి సంసారం చూడడం కూడా ఇదే మొదటి సారి. పాప విషయంలో సలహాలు ఇవ్వడం, దానికి ఇవ్వాల్సిన ఆహారం చూసుకోడం, తనకి తెలిసిన చిట్కాలు నాకు నేర్పించడం ఇలా చక్కగా ఉండేవారు. పాలు తోడువేయడం, కూరగాయలు వేరు చేసి జాగ్రత్త చేయడం ఇలాటి మనం విసుక్కుని వదిలేసే చిన్న చిన్న పనులు అందుకుంటూ హాయిగా ఉండేవారు, ఉండనిచ్చేవారు. ఉన్నట్టుండి అంతా తారుమారైపోయిందే.”

“ఏమైంది? నిన్ను ఏమన్నా మాటలతో సాధిస్తున్నారా?” కంగారుగా అడిగాను.

“ఛ. అలాంటిది ఏమీ లేదే. మామయ్య ఉన్నన్ని రోజులు బాగానే ఉన్నారు. జాబ్ లో జాయిన్ అవ్వాలి కాబట్టి ఒక నెల ఉండి వెళ్లిపోయారు మామయ్య. అప్పటి నుండీ మార్పు మొదలైంది అత్తయ్యలో. ఒంటరిగా ఉండలేకపోతున్నారు. పొద్దున్న మేము ఆఫీసులకి వెళితే సాయంత్రం దాకా ఒక్కరే ఉండాలి. ఎక్కడికీ ఒక్కరే వెళ్ళలేరు కదా. పైగా పాప కూడా ఉంది. తనకి తోచడం లేదు అస్సలు. ఇక ఇన్నాళ్లు లేని వంకలు అన్నీ కనపడసాగాయి. ఎవరైనా చుట్టాలు స్కైప్ చేయడం ఆలస్యం కళ్ళల్లో నీళ్లు పెట్టేసుకుంటున్నారు.

మనవేమన్నా ఇంద్ర భవనాలా ఇక్కడ? ‘పొందిగ్గా ఉన్నాయ్ ఇళ్ళు, మీకు సరిగ్గా సరిపోతాయి’ అన్నావిడ, ఇప్పుడేమో ‘ఏంటి ఈ కొంపలు అగ్గి పెట్టెల్లా ఉన్నాయి. అందరూ ఒకే సారి నడిస్తే తొక్కుడు బిళ్ళ ఆడినట్లు ఒకరి కాళ్ళు ఒకరు తొక్కుకోవాల్సిందే’ అని ఓ నస.

‘ఇద్దరు మనుషులకి రెండు గిన్నెలు చాలు, ఎంత వంట కావాలి చెప్పు. చక చకా చేసేయొచ్చు పని ఇక్కడ. అన్నీ అనుకూలంగా ఉన్నాయి’ అని చెప్పిన మనిషి ఇప్పుడేమో పని సహాయానికి మనుషుల్లేరని, ఇంకో నస. వండుకోవడం, గిన్నెలు కడుక్కోవడం తప్ప ఇంకో పని లేదని ఒకటే గోల. నేను చూసుకుంటాను మీరు వదిలెయ్యండి అత్తయ్య అంటే వినరు.

‘ఇన్నేసి చదువులు చవివేసి చకచకా ఉద్యోగాలు చేస్తున్నా ఎంత పొందిగ్గా ఉన్నావ్ అమ్మాయ్’ అని మెచ్చుకున్న మనిషి, ‘ఇంత చదువులు చదివీ బాత్రూములు కడగా, చాకలి పని చేసుకోను సరిపోతోంది నీకు’ అని పాట పాడడం మొదలెట్టారు. ఒకరోజు ఏకంగా ఇండియాలో తన పనిమనిషితో ఫోన్ లో మాట్లాడి ఒకటే ఇదైపోయారు. అటు నుండి ఆ పనమ్మాయి ఓదార్పులు. మా గురించి ఏమనుకుంటారు చెప్పు?

మనవేమన్నా కుబేరులమా? ఇండియాలో మాయమైపోయిన మిడిల్ క్లాస్ ని ఇక్కడ మెయింటైన్ చేస్తున్నాం అంతేగా!

అసలు మామయ్యతో పాటు తిరిగి వెళ్తారా అంటే, 'సంవత్సరం నిండకుండా పాపని డే కేర్ లో ఎందుకూ? వీల్లేదు' అని తానే ఉంటాను అన్నారు. రిటర్న్ టికెట్స్ కూడా బుక్ అయిపోయాక ఇప్పుడు ఇలా బాధపడుతుంటే ఏం చెయ్యాలో తోచడం లేదు. 'సరే మరి తిరిగి వెళ్ళిపోతారా?' అని అడిగితే 'నేను మీకు బరువైపోయానా?' అంటారు.

ఈ మధ్య రోజూ నేను ఇంటికి వచ్చి రాగానే వాకింగ్ అని చెప్పి వెళ్లిపోతున్నారు. అప్పటి నుండి ఇంకా ఎక్కువ మార్పు కనపడుతోంది. ఏమిట్రా సంగతి అని ఈయన ఒకసారి డిటెక్షన్ చేస్తే తెలిసింది, ఇలా అపార్ట్మెంట్ లో ఉన్న ఆంటీలు, అంకుల్స్ అందరు పక్కన ఉన్న పార్క్ లో చేరి పిల్లల గురించి ఒకటే కంప్లయింట్లు చేస్కుంటున్నారుట.

సముద్రాలు దాటించి మా దగ్గర చాకిరీ చేయిస్తున్నారని ఒకరు బాధపడితే, అప్పట్లో అత్తగార్లకి చాకిరీ చేసాము ఇప్పుడు కోడళ్ళకి చాకిరీ చేస్తున్నాము అని వారి మీద వారే జాలి పడుతూ ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారుట.

నాకేం చేయాలో పాలుపోవటం లేదే. చక్కగా కళకళలాడుతూ తిరిగే మనిషి ఒక్కసారి గా రుసరుసలాడటం మొదలుపెట్టారు.

ఏమి మాట్లాడితే ఏమి అర్ధం చేసుకుంటారో అని గుబులు గుబులుగా ఉంటోంది. ఈ సాయంత్రం సమావేశాలు ఎక్కువైనప్పటి నుంచి 'నీ పని నీది – నా పని నాది' అన్నట్టు అంటీ ముట్టనట్టు ఉంటున్నారు." ఇన్ని రోజులూ అణచుకున్న అసహనం అంతా వరదలా బయటపడి చెప్పుకుంటూ వెళ్తోంది భవ్య.

"పోనీ నన్నేమైనా మాటలు అంటారా అంటే అదీ లేదు. నా బాధంతా కిషోర్ గురించే. ఆవిడ అలా మదర్ ఇండియాలా ముభావంగా ఉంటోంటే ఒకటే బాధ పడిపోతున్నాడు. ఏం చేస్తే అమ్మకి సంతోషంగా ఉంటుందని ఒకటే ఆలోచన అయిపోయింది తనకి. ఆవిడకి తోచట్లేదని తెలుగు సీరియళ్లు పెట్టించాడు. తోటపని చేస్తే ఏమైనా మనసు మరలుతుందేమో అని చుట్టూ పక్కల నర్సరీలు అన్నీ తిప్పించి ఆవిడకిష్టమైన మొక్కలు తెప్పించి చిన్న తోటని ఏర్పాటు చేసాడు. ఇండియాలో ఇంటి పక్కవాళ్ళనుండి, ఆవిడ పుట్టిన ఊర్లో పక్కింటి వాళ్ళ వరకు పేరు పేరున ఎవరికీ ఏమి కావాలన్నా నాలుగు కాకపోతే పది షాపులు తిప్పించి మరీ అందరికీ ఏదో ఒక గిఫ్ట్ కొనిస్తున్నాడు.

ప్రతీ వీకెండ్ ఎక్కడో ఒక చోటికి ట్రిప్ వేయాల్సిందే. ఇంట్లో ఉన్నంతసేపు ఆ నొప్పి ఈ నొప్పి అంటారు కదా, వీకెండ్ ట్రిప్స్ లో మాత్రం ఎంత చురుగ్గా కాస్తంత కూడా అలవకుండా తిరిగేస్తారో తెలుసా! వెళ్లిన ప్రతి చోటుని స్టేటస్ లోకి ఎక్కిస్తూ, ఇక్కడి లోకల్ వాళ్ళతో ఫోటోలు, వాటిని వెంటనే వాట్స్ అప్ లో ఫేస్బుక్ లో ఫ్రెండ్స్ కి షేర్ చేసేసి... అబ్బో అసలు మాములు హంగామా కాదులే. మాక్కూడా అదే కావాల్సింది. ఇన్ని చేసినా మళ్ళీ ఇంటికి రాగానే షరా మాములే. ఏదో మేము చేయరాని పాపం చేసినట్టు, తనని జైల్లో పెట్టేసినట్టు.

అత్తయ్య మోహంలో సంతోషం కనపడడం లేదన్న దిగులుతో కిషోర్ కూడా ఆర్ట్ ఫిల్మ్ హీరోయిన్లా ఏటో చూస్తూ ఉంటున్నాడు ఈ మధ్య. వీళ్ళిద్దరి మధ్య నాకు పిచ్చెత్తి పోతోంది. ఒకవేళ అత్తయ్య లోపల సంతోషంగా వున్నా బయటపడడం లేదేమో అనిపిస్తోంది నాకు. ఒక్కోసారి కిషోర్ ఆవిడ కోసం అలా ఆరాటపడడం, ఆ తపన అన్ని కూడా ఆవిడ ఎంజాయ్ చేస్తున్నారేమో అనిపిస్తోంది. వాళ్ళిద్దరి మధ్యకి వెళ్లి మళ్ళీ కొత్త సమస్య తేవడం ఎందుకని వదిలేసా. మా చేతనైనంత చేస్తున్నా, అన్నిటికి మా ఉద్యోగాలతో మా బిజీ లైఫ్ తో పోల్చి తేలిగ్గా తీసిపడేస్తున్నారు. దేన్నని వదులుకోగలము చెప్పు. కూర్చుని తినేటన్ని ఆస్తులు లేనివాళ్ళం కదా!

కనపడుతున్న వాస్తవాలు పట్టించుకోరు కానీ 'తల్లితండ్రుల్ని వదిలేసిన పిల్లల గతి ఏమవుతుందంటే... ఈ వీడియో చూడండి!!' అనే యూ ట్యూబ్ వీడియోలు, వాట్సాప్ ఫార్వర్డ్ మెసేజిలు పెట్టుకుని శ్రద్ధగా వింటుంటారు. ఈ సోషల్ మీడియా వల్ల పిల్లలు ఎంత పాడవుతున్నారో పెద్దవాళ్ళు అంత కన్నా ఛాదస్తంగా, మూర్ఖంగా తయారవుతున్నారనిపిస్తోంది. ఉద్యోగాలతో, పాపతో, వీకెండ్ ట్రిప్పులతో క్షణం తీరిక లేకుండా ఉంటే అలసట రాక ఇంకేమి వస్తుంది చెప్పు. ఈ ఆలోచనలతో 'మెంటల్ ఫెటీగ్' ఎక్కువ అయిపోతోంది అసలు.

ఇంట్లో వేడెక్కుతున్న వాతావరణం తట్టుకోలేక మనసులో ఆలోచనలు బయటపెట్టుకుంటే కానీ మళ్ళీ మాములు మనిషిని కాలేనని లీవ్ పెట్టేసి మరీ ఇక్కడికి వచ్చానే. ఇప్పుడు కాస్త ప్రశాంతంగా ఉంది." అని చెప్పుకుంది భవ్య.

★★★★★★★★★★★★★★

ఆరోజు సాయంత్రం భవ్య వెళ్ళిపోగానే ఆంటీ గురించి ఆలోచించాను. ఆవిడని కదిలిస్తే ఆమె వైపు వాదన కూడా ఇంతే బలంగా చెప్పగలరు. ఇక్కడి ఏకాంతం అనుభవమే కదా నాకు. ప్రస్తుతం ఆవిడకి కావాల్సింది మంచి కంపెనీ అంతే. వయసు పెరిగినా ఆలోచనా పరిధి పెరగని స్నేహాలు ఇలాంటి నెగటివ్ థాట్స్ నే పెంచుతుంటాయి. 'ఆవిడకంటూ గుర్తింపునిచ్చి, సంతోషపరిచే చిన్న వ్యాపకం ఒకటి ఉంటె పరిస్థితి వేరేలా ఉంటుందేమో కదా?' అనిపించింది. అసలు వ్యాపకాలు పెంచుకోవాలి అనుకోవాలె గానీ అమెరికాలో ఉన్నన్ని అవకాశాలు ఇంకెక్కడ ఉన్నాయి? కోరుకున్న వారికి కోరుకున్నంత హడావిడి ఇక్కడ.

లాభం లేదు, ఆంటీకి నాణేనికి ఉన్న మరొక వైపు కూడా చూపించాల్సిందే. అసలు ఏమనుకుంటున్నారు ఆంటీ! అమెరికాలో మనవాళ్ళు నేర్వగలేని విద్యలేదు, రాణించగలేని కళ లేదు. దారులు వెతుక్కోవాలి అంతే. నాలుగు గోడల మధ్య కూర్చుని తలుపేసుకుంటే, అమెరికా అయినా అమీర్ పేట్ అపార్ట్మెంట్ అయినా ఒక్కటే. అనుకున్నదే ఆలస్యం నాకు తీరిక, ఓపిక లేక మ్యూట్ లో పెట్టి వదిలేసిన వాట్సాప్ గ్రూపుల లిస్ట్ వెతకడం మొదలుపెట్టా.

మొత్తానికి ఉన్న గ్రూపులన్నీ వెతికి సహస్రనామ పారాయణం బ్యాచ్ ఒకటి, టెంపుల్ వాలంటీరింగ్ బ్యాచ్ ఒకటి పట్టుకున్నాను. అందులో మా 'ఫ్రెండుకి ఫ్రెండుకి ఫ్రెండు' ఒకరిని పట్టుకుని ఆంటీ పేరు ఎంటర్ చేయించా. ఒక శుభ ముహూర్తాన భవ్య వాళ్ళ ఇంటికి వెళ్లి, 'గుళ్లో మాకు తెలిసిన వారి సత్యనారాయణ వ్రతానికి కాస్త పెద్ద దిక్కుగా ఉందురు గానీ రండి ఆంటీ' అని ఒక శనివారం నాకూడా తీస్కుని వెళ్లాను. ఎంత పొంగిపోయారో ఆవిడ. పెద్దవాళ్లంత అల్ప సంతోషులు మరెవ్వరూ ఉండరు కదా! వ్రతం అయిపోయాక మా టెంపుల్ వాలంటీర్ గారి దగ్గర కాసేపు కూర్చోపెట్టి ఇప్పుడే వస్తానని చెప్పి పారిపోయా.

ఒక అరగంట తర్వాత వచ్చి ఆంటీ ఇక బయల్దేరదామా అంటే, వస్తూ వస్తూ "అమ్మాయ్ నేను ఎంత వద్దన్నా వినకుండా లడ్డు కౌంటర్ దగ్గర శనివారాలు సాయంత్రం డ్యూటీ వేసింది ఆ పిల్ల. వాలంటీర్లకి అభిషేకం, స్పెషల్ దర్శనాలు ఉంటాయి అంటే ఇంకో నాలుగు నెలలే కదా అని కాదనలేక పోయా." అని వెలిగిపోతున్న మొహంతో చెప్తున్న ఆవిడని చూస్తే ముచ్చటేసింది.

అలాగే సహస్రనామ పారాయణం బ్యాచ్ లో కూడా జాయిన్ అయిపోయారు. అలా అలా నెమ్మదిగా తనకంటూ పరిచయాలు పెంచుకుని బిజీ అయిపోయారు ఆంటీ.

మరేం అనుకున్నారు అమెరికా అంటే. అందరి సరదా తీర్చేస్తుంది ఈ దేశం.

★★★★★★★★★★★★★★

"హలో! హాయ్ వే."

"హాయ్ భవ్య. ఎలావున్నావు? పాప బాగుందా. ఆంటీ ఇండియా జాగ్రత్తగా చేరిపోయారా?"

"యా! అంతా బాగున్నామే. అత్తయ్య కూడా సేఫ్ గా చేరుకున్నారు. చాలా హ్యాపీగా తిరిగి వెళ్లారు. తనకి బోలెడు మంది ఫ్రెండ్స్ అయ్యారు ఇక్కడ. ఆ పరిచయాలతో ఇక్కడ అపార్ట్మెంట్ లో పిల్లలకి కొన్నిరోజులు తెలుగు పద్యాలూ, కథలు కూడా చెప్పారు. తనకంటూ ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు మా కమ్యూనిటీలో. వాళ్ళ పారాయణం ఫ్రెండ్స్, గుడిలో ఫ్రెండ్స్ ఫేర్ వెల్ కూడా ఇచ్చారు. ఏమైనా ఈ గుర్తింపు తనపై తనకి విశ్వాసాన్ని పెంచినట్టుంది. ఇండియా వెళ్ళాక అక్కడ కూడా ఇలా తెలుగు పాటలు, పాఠాలు నేర్పుదామనే ఆలోచన వచ్చింది. మొత్తానికి కొత్తగా ఆలోచించగలుగుతున్నారు. అత్తయ్య నవ్వుతూ సంతోషంగా వెళ్లినందుకు కిషోర్ అయితే చాలా చాలా ఆనందంగా ఉన్నాడు.

థాంక్స్ వే.

అవును ఇంతకీ ఇలా చెయ్యాలనే ఆలోచన నీకెలా తట్టిందీ?"

"హలో...! నేను కూడా ఆరు నెలల 'అమెరికా కోడరికం' చేసానమ్మా... ఈ విషయంలో నీకు సీనియర్ ని. అనుభవం అన్ని పాఠాలు నేర్పుతుంది!!" అని చెప్పాను.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments